క్లుప్తంగా

30న ఆడికృత్తిక మహోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న ఆడికృత్తిక పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ తెలిపారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, విభూది అభిషేకం, విశేష అలంకరణ జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని సూచించారు. అలాగే స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు భక్తులు తమ స్వహస్తములతో పాలాభిషేకం చేయవచ్చునని కమిటీ సభ్యులు తెలిపారు.

ఐటీఐలో ఉచిత టైలరింగ్ శిక్షణ

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తారని వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు గురువారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిల్క్ హబ్ ద్వారా మూడు నెలల పాటు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువతులు, మహిళలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు కో ఆర్డినేటర్ చౌడయ్య, సెల్ నంబర్ 9618655759ను సంప్రదించాలని సూచించారు.

31న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

మదనపల్లె సిటీ: పాలిసెట్-24 స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 31న నిర్వహించనున్నట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. స్థానిక కాలేజీలో జరిగే స్పాట్ అడ్మిషనకు పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించిన వారు, అర్హత సాధించలేని వారు, పదవ తరగతి పరీక్ష పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు పాలిసెట్-24 హాల్ టిక్కెట్టు, ర్యాంకు కార్డు, 10 వ తరగతి మార్కుల జాబితా, పదో తరగతి టీసీ, స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. కాలేజీలో డీసీఈ, డీఎంఈ, డీఈసీఈ కోర్సులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9912342073ను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా పీర్ల పండుగ



పీర్ల ఊరేగింపు దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటలో పీర్ల పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారు. పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పీర్ల ఊరేగింపు నెలాఖరు వరకు జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పీర్లకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి డప్పుల చప్పుళ్లతో ఉత్సాహంగా పీర్లను గ్రామపుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల పాతూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ సి. వెంకటరమణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జనార్దన్, జగన్‌మోహన్, సచివాలయ కార్యదర్శి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీకే కో ఆర్డినేటర్‌గా డా. మంజుల



కేవీకే కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డా. కె.మంజుల

కలికిరి: కేవీకే కో-ఆర్డినేటర్‌గా డా. కె.మంజుల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కో-ఆర్డినేటర్ డా. జీఎస్ పాండురంగ తిరుపతి వ్యవసాయ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీపై వెళ్లారు. తిరుపతి వ్యవసాయ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆమె కేవీకే కో-ఆర్డినేటర్‌గా బదిలీపై వచ్చారు. సిబ్బంది సహకారంతో రైతులకు చిత్తశుద్ధితో మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.

మద్యం మత్తు .. జీవితాలు చిత్తు

బర్త్‌డే, శుభకార్యం, లేక బాధాకరమైన సందర్భంలో నిషా అందిస్తున్న మత్తు, గమ్మత్తుగా మారి ఉప్పెనలా ముంచేస్తోంది. మద్యం కాటుకు జీవితాలు చిత్తవుతున్నాయి. తాగిన మైకంలో యువత చిత్తు అవుతున్నారు. తమతో పాటు ఇతరుల జీవితాలను కూడా పణంగా పెడుతున్నారు. ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం డ్రంకెన్ డ్రైవ్ వల్లే జరుగుతున్నాయి.

- మందు బాబులూ.. మారండి
- ఆలోచించండి... ఓ అమ్మా నాన్న
- పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
- డ్రంకెన్ డ్రైవ్‌తో అధిక రోడ్డు ప్రమాదాలు



మదనపల్లె సిటీ: పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన సాయికుమార్ ఇటీవల కొత్త బైక్ కొన్నాడు. కొత్త బైక్ కొన్న ఆనందంతో స్నేహితుడు మోహన్‌తో కలిసి జల్సా చేసుకోవడానికి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు వెళ్లి పూటుగా మద్యం సేవించి బైక్‌లో వస్తూ ప్రమాదశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటన ఇటీవల మదనపల్లె వద్ద చోటు చేసుకుంది. రాకేష్ మదనపల్లె సమీపంలో ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖర్చుల కోసం తల్లిదండ్రులు ఇద్దరు ఉద్యోగాలు చేస్తూ ప్రతి నెలా పెద్ద మొత్తంలో డబ్బులు పంపిస్తుంటారు. వాటితో మద్యం తాగుతూ, జల్సాలు చేస్తుంటాడు. కుమారుడు వాటిని ఏ అవసరాలకు ఖర్చు పెడుతున్నాడనే విషయం గురించి ఏనాడూ ఆలోచించలేదు. ప్రథమ సంవత్సరం మంచి ఉత్తీర్ణుడైన రాము ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయ్యాడు. తల్లిదండ్రులు మందలించి వుంటే తన కుమారుడు మద్యం, జల్సాలకు అలవాటు పడి ఉండేవాడు కాదు. ఇది ఒక సాయిమోహన్, మోహన్, రాకేష్‌ల పరిస్థితే కాదు.. యుక్త వయస్సులో చాలా మంది పెడతోవ పడుతున్నారు. ఇటీవల మదనపల్లెలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

తల్లిదండ్రులకు శోకం

పదమూడు, పదహారేళ్ల వయస్సులో శారీరక మార్పులతో పిల్లలు బాల్యం నుంచి కౌమారంలో అడుగుపెడతారు. ఆ సమయంలో కొత్త కొత్త ప్రయోగాలతో ప్రమాదాలు కొనితెచ్చుకునే వారు కొందరైతే మొండిఘటాలుగా మారి తల్లిదండ్రులను ఎదిరించేవారు ఇంకొందరు. కొందరు కుర్రకారు హద్దు దాటేస్తున్నారు. జల్సాతో మద్యం తాగడం, మత్తులో స్నేహితులతో కలిసి వాహనాలపై రయ్..రయ్ మంటూ దూసుకెళ్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం, అతిగా గారాబం చేయడంతో పిల్లలు చేతికందకుండా పోతున్నారు. తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చి పోతున్నారు. యవ్వనంలో ఎక్కువ మంది మద్యానికి బానిసలవుతున్నారు. చిన్నగా మొదలయ్యే విందులు తర్వాత వారిని చెడు మార్గాల వైపు ప్రోత్సహిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది.

తల్లిదండ్రులు గమనించాలి



యుక్త వయస్సు వచ్చాక పిల్లలను తల్లిదండ్రులు గమనించాలి. మార్పును గుర్తించి ముందుగా సర్దిచెప్పే యత్నం చేయాలి. భవిష్యత్తులో ఎదరయ్యే దుష్పరిణామం గురించి అవగాహన కల్పించాలి. పిల్లలు ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారనేది గమనించాలి. అవసరాలకు మించి డబ్బులు ఇవ్వడం మానుకోవాలి. మద్యంకు బానిసైతే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలి. **చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె**

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలి



డీటీ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు : అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని మాల మహానాడు ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ కోరారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబరు 200/3లో 53 సెంట్లు ప్రభుత్వ భూమిని అంబేడ్కర్ భవనానికి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు విజయవాడ పీపీఎల్‌ఏ వారికి అర్జీ పెట్టుకోగా వారు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారని తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ స్పందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు జయరామచంద్రయ్య, మల్లికార్జున, మోహన్‌బాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాటా ధరలు



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: టమాటా ధరలు తగ్గుతున్నాయి. రోజు రోజుకు దిగుబడులు పెరగడంతో ధరల్లో మార్పులు కన్పిస్తున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకం కిలో రూ.88 పలికిన టమాటా గురువారం మొదటి రకం కిలో రూ.38 పలికింది. గత వారం రోజుల క్రితం 850 మెట్రిక్ టన్నులు కాయలు వస్తుండగా గురువారం 1,328 మెట్రిక్ టన్నులు వచ్చాయి. మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి రైతులు కాయలు తీసుకువస్తున్నాయి. ధరలు పుంజుకోవడంతో చాలా మంది రైతులు టమాటా సాగుపై ఆసక్తి చూపారు. ఇటీవల రైతులు టమాటా కోతలు కోయడంతో దిగుబడులు రోజు రోజుకు పుంజుకున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కాయలు వస్తున్నాయి. దీంతో ధరలు తగ్గుతున్నాయి. దిగబడి పెరిగితే ధరలు తగ్గుముఖం పడుతాయని వ్యాపారవర్గాలు తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది

కలకడ : ప్రభుత్వ పాఠశాలల, క్రీడల అభివృద్ధికి దాతలు చేస్తున్న కృషి, విద్యార్థులకు వారు అందించే సహకారం మరువలేనిదని మండలంలోని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మోడెం చగల్‌రాయుడు కొనియాడారు. గురువారం స్థానిక పాఠశాలలోని విద్యార్థులకు బెంగళూరుకు చెందిన సిబ్బాల రవీంద్ర దంపతులు క్రీడా సామాగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా చెంగల్‌రాయుడు మాట్లాడుతూ క్రీడా సామాగ్రి గ్రామీణ ప్రాంత విద్యార్థులను క్రీడా రంగంలో ప్రోత్సహించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే కోన మాజీ సర్పంచ్ బరకం శ్రీనివాసులురెడ్డి క్రీడా మైదానానికి మూడు ఎకరాల భూమిని విరాళంగా అందజేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్యాగరాజు, ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగమునినాయక్, రమేష్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద దోషులను వెంటనే తేల్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి తదితరులు

మదనపల్లె : సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనలో విచారణ వేగవంతం చేసి, దోషులను నిర్ధారించాలని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్ శివారెడ్డి, సలీం, రహీం కలిసి ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటన జరిగిన వెంటనే రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్పందించి డీజీపీ, సీఐడీ చీఫ్, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీ అధికారులతో విచారణకు ఆదేశించడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ప్రమేయంతోనే రెవెన్యూ రికార్డులు తగలబెట్టారని ప్రజల్లో అనుమానాలు, అపోహలు కలిగేలా కొన్ని రాజకీయపక్షాలు వ్యవహరిస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణను అధికారులు వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. సబ్‌కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనలో కాలిపోయిన రికార్డులకు సంబంధించి రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని, సబ్ కలెక్టరేట్‌కు పంపిన ప్రతి ఫైలుకు సంబంధించి రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలోనూ ఉంటాయని, ప్రజలు భయపడాల్సిన పని లేదని చెప్పారు.

అనుమతి లేకుంటే జరిమానా తప్పదు



అనుమతి లేని ఇళ్లను గుర్తిస్తున్న ఈఓ గురుమోహన్

పీలేరు : పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే జరిమానా తప్పదని ఈఓ గురుమోహన్ హెచ్చరించారు. గురువారం పీలేరు పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు, నీటి కొళాయిలు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు పంచాయతీ అనుమతులు పొందడం ద్వారా నీటి సమస్య కానీ, దారి సమస్య గానీ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పంచాయతీ అధికారులు సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. పంచాయతీకి చెల్లించాల్సిన పాత పన్నుల బకాయిలను క్రమ పద్ధతిలో ప్రజల ఉంచి వసూలు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. తద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం పెరగడంతో పాటు ఇంటి యజమానులు ప్రశాంతంగా ఉండవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

కలికిరి: మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ భారతి అన్నారు. మండలంలోని రాజువారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ తరపున అమలులో ఉన్న వన్ స్టాఫ్ సెంటర్, సమగ్ర బాలల పరిరక్షణ, గృహ హింస చట్టం, బాల్య వివాహాల నిషేదం, బాలికల విద్య తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో రికార్డు గదుల తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సీఐ పులిశేఖర్

పెద్దతిప్పసముద్రం: మదనపల్లిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా మండలాల పోలీస్ సిబ్బందితో కలసి రికార్డుల గదులను క్షుణంగా పరిశీలించారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డు గదుల స్థితిగతులు, సీసీ కెమెరాలు, తలుపులు, కిటికీల దుస్థితి, విద్యుత్ సరఫరాను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. మండల కేంద్రంలో పోలీసులు రాత్రి వేళ నిత్యం గస్తీ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాల్లో నైట్ వాచ్‌మెన్‌ల నుంచి సంతకాలు తీసుకోవాలని సూచించారు.

రికార్డుల పరిశీలన

వాల్మీకిపురం: జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ పులిశేఖర్ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రారు కార్యాలయ రికార్డు రూములను పరిశీలించారు. పలు రికార్డులను సీజ్ చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అలాగే కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయాల్లో వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా కార్యాలయాల్లోకి అనుమతించకూడదన్నారు. ముఖ్యమైన రికార్డులను అధికారుల సంరక్షణలో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాతిజున్ కుబ్రా, డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సబ్ రిజిస్ట్రార్ స్వరూప్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం



సమావేశంలో మాట్లాడుతున్న తులసేంద్ర

బి.కొత్తకోట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి. తులసేంద్ర , ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్ పై రెండవ రోజు గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్, కాంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గ్రాస్ శాలరీ పెంచాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ రామచంద్రయ్య,రాధాకష్ణమూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



తాగునీటి పైపులను మరమత్తులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కేవీపల్లె : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పైపులైన్ల మరమ్మతులు, ట్యాంకుల పరిశుభ్రత చేపట్టినట్లు ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. గురువారం మండలంలోని మార్రేళ్ల పంచాయతీ పరిధిలో పైపుల మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా పైపులు లీకేజీ లేకుండా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతి గుంటిపల్లిలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై రెండు రోజుల క్రితం సాక్షి పత్రికలో వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి ఆదేశాల మేరకు సర్పంచ్ శారద, పంచాయతి కార్యదర్శి సురేంద్రబాబులు గురువారం నీటి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. కాలనీలో పైప్‌లైన్ వేసి ఇటు గ్రామస్థులకు అటు కాలనీ వాసులకు తాగునీటి సరఫరా అయ్యేలా గేట్‌వాల్ అమర్చినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ మార్రెళ్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వం ద్వారా పక్కా గృహాలు మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ వెంకట్‌దాస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మనందరెడ్డి, ఏఈ శ్రీనివాసులు తో కలసి మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రధానంగా పునాదులు కూడా చేపట్టని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పనులు చేపట్టేలా చూడాలన్నారు. అనంతరం ఈఈ, డీఈ విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని 115 మంది లబ్ధిదారులు గృహాలు మంజూరైనా కూడా ఇంత వరకు ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా నిర్మాణంలో ఉన్న 3,191 గృహాలను పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

జెండా ఆవిష్కరణను పండుగలా చేయాలి

పీలేరురూరల్ : జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, నాయకులు గురవయ్య, దొడ్డి సురేష్, శ్రీనివాసులు, విశ్వనాథ, నాగేశ్వర, గంగాధర, కొండప్ప, హుస్సేనయ్య పాల్గొన్నారు.

దోషులను తప్పించేందుకే ఉద్యోగులపై వేటు

మదనపల్లె : సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనలో దోషులు తప్పించేందుకే ఉద్యోగులపై వేటు వేశారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. గురువారం స్థానిక సీపీఐ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ ఫైల్స్ దగ్ధం కేసులో నిందితులను, దోషులను పట్టుకోవాల్సింది పోయి, వన్ టౌన్ సీఐ వలిబాషుని వీఆర్‌కు పంపడం, ఇద్దరు కానిస్టేబుల్స్‌ని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఘటనకు సంబంధంలేని వారిపై చర్యలు తీసుకోవడం వలన అసలైన దోషులు తప్పించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిరుమల, ముబారక్,పాల్గొన్నారు.

మనదేశ సంస్కృతి, ఔన్నత్యాన్ని చాటిచెప్పాలి



జాతీయ నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

వాల్మీకిపురం: భారతదేశ సంస్కృతి, ఔన్నత్యాన్ని విద్యార్థులకు చాటి చెప్పాలని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్ఎం శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పాఠశాలలో జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్టభారత్, దేశభక్తి గీతాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ బాషల్లో మాట్లాడడం, మన రాజ్యాంగంలోని రాజ్యాంగ పీఠికను చదివి, దాన్ని అర్థాన్ని పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయులు పుష్పలత, నాగసులోచన, షబీర్‌బాషా, పర్హాత్, ఉమాదేవి, వసుంధర, రాధ పాల్గొన్నారు.

శతవసంతాల మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటీఎం ప్రారంభించిన మొదటి టౌన్‌బ్యాంక్
- రూ.90 కోట్లకు చేరిన డిపాజిట్లు
- పాలకవర్గం ఏర్పాటైతే మొబైల్ బ్యాంకింగ్‌కు చర్యలు



మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్

మదనపల్లె : సహకార ఉద్యమ స్ఫూర్తితో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికసహాయం కలిగించాలనే ఉద్దేశంతో మదనపల్లె పట్టణంలో తొలి బ్యాంకుగా ప్రారంభమైన కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వంద వసంతాలు పూర్తిచేసుకుందని సహకార శాఖాధికారి, పర్సన్-ఇన్‌చార్జి జి.ఎ.రవిచంద్రన్, సీఈఓ పి.వి.ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని టౌన్ బ్యాంక్ ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్యాంకు వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించే విజయోత్సవ వేడుకలు, ఆర్థిక లావాదేవీలు, డిపాజిట్లు, ఖాతాదారులు, బ్యాంకు టర్నోవర్, ఇన్‌కమ్ టాక్స్, ఖాతాదారులకు ఇచ్చిన రుణాలు, బ్యాంక్ డిపాజిట్లు, ఆదాయవ్యయాలపై తెలియజేశారు. మదనపల్లి టౌన్ బ్యాంకును 1924 జూన్ 24న గంగారపు పెద్దప్ప రెడ్డి స్థాపించారన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో ఉన్న సహకార చట్టాల ప్రకారం ఈ బ్యాంకు స్థాపించినట్లు పేర్కొన్నారు. 1987లో ఎస్‌బీఐ ద్వారా బ్యాంకింగ్ అనుమతి పొందడం జరిగిందని చెప్పారు. 1957లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ నీలం సంజీవరెడ్డి బ్యాంకు భవనాన్ని ప్రారంభించారని తెలిపారు. రూ. 410 షేరు ధనముతో 30 మంది సభ్యులతో బ్యాంకు ప్రారంభించగా ప్రస్తుతం ఏ క్లాస్ సభ్యులు 3,441 మంది ఉన్నట్లు తెలిపారు. బ్యాంకు డిపాజిట్లు ఇప్పటివరకు రూ.90 కోట్లకు చేరుకున్నాయన్నారు. చెక్ ట్రాన్సాక్షన్ సిస్టం (సిటిఎస్) రాష్ట్రంలోనే తొలిసారిగా మదనపల్లి టౌన్ బ్యాంకులో ప్రారంభించారని పేర్కొన్నారు. పాలకవర్గం ఏర్పాటు లేనందున మొబైల్ బ్యాంకింగ్ సేవలు ఆలస్యమవుతున్నాయని, త్వరలో పాలకవర్గం ఏర్పాటుకు కృషి చేయాల్సిందిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరామని తెలిపారు. వందేళ్ల విజయోత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.